



# కాగితం పులి

మొలకలపల్లి కోటేశ్వరరావు

"రోయ్, పోలో! బిళ్ళంగోడాటాడుకుందామా?" కొండన్నకుంట గట్టుమీద ఎగురుతూ వుత్సాహం వురకలువేస్తుండగా అడిగాడు రోశోడు, పోలుగోణ్ణి.

మధ్యాహ్నం కుంటలో కప్పలు వాన రాకడని సూచిస్తూ బెక బెక మంటూ గోల చేస్తున్నాయి. గాలి రివ్వున వీస్తూంది. ముసురుపట్టి మబ్బులు ఉత్సాహంగా పరుగులు పెడుతున్నాయి. వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా వుంది.

కొండన్న కుంట ప్రక్కనే వున్న కొద్దిపాటి పచ్చిక బీట్లో బరిగొడ్లు మేస్తూ అప్పుడప్పుడు ఆనందంలోపడి కుమ్ములాడుకుంటున్నాయి. ఈ బర్రెలతోపాటు ఒక చిన్న పొట్టేలు పిల్ల కూడా ఆ బీట్లో మేస్తూ చెంగు చెంగున గంతులేస్తున్నది.

"సయ్యే...రారా దమ్ముంటే! వోడి పోయినోడు వొట్టిపోయిన గొడ్డే! ఆట మజ్జెలో మాత్తరం 'మా కాపొత్తన్నాడు, నేను రాను' అని ఆట వదిలిపెట్టి పోకూడదు. అట్టయితేనే రా!"

"అట్నే...రామరి! బరిగొడ్లని చూసుకుంటూ ఆడా లబ్బియ్యా!" రోశోడన్నాడు.

"వొరేయ్, మోసుగోడు కూడా వత్తన్నాడ్రేయ్! ఆడూ, నేనూ ఒక పక్కుంటాం! మువ్వొక్కడివే వొక పక్కుండు!"

"రోయ్, మోసుగో! తొందరగా రావె!" రోశోడు కేక పెట్టాడు.

వాళ్ళని చూసి, కేక విని మోసుగోడు తవ గొడ్లని పరిగెత్తించుకుంటూ వచ్చాడు. వాటిని బీట్లోకి తోలి తను కూడా ఆటకి వచ్చాడు.

ఆట మొదలైంది.

ముగ్గురూ మంచి రసకందంలో పడి ఆటాడు కుంటున్నారు. అప్పుడప్పుడు బరిగొడ్లవైపు వో చూపు పడేస్తున్నారు.

చల్లని గాలికి హాయిగా పొలాలు చూసుకోవడానికి గొడుగు వూపుకుంటూ వస్తూన్న నారాయణ బరిగొడ్లని వదిలిపెట్టి, గంతులేస్తూ గోలగోలగా ఆటాడుకుంటున్న బుడ్డోళ్ళని చూసాడు-దూరం నించే.

"కుక్కల కొడుకులు...గొడ్లని వదిలి ఆటల్లో పడ్డారు మళ్ళీ" అని మండిపడిపోయాడు. అడుగులు వడివడిగా పడసాగాయి.

నారాయణ జీతగాడు రోశోడు. పోలుగోడు లక్ష్మయ్య జీతగాడు.

ఇద్దరూ రోజూ గొడ్లనికలిపే మేపుకు వస్తూంటారు. ఇద్దరికీ రోజూ యజమానుల చేతుల్లో తన్నులు పడుతూనే వుంటాయి.

పోలుగోడికి పధ్నాలుగేళ్ళు గానీ పదేళ్ళ వాడిలా పీలగా, వుసూరుమంటూ వుంటాడు.

రోశోడికి పదిహేనేళ్ళు. వాడూ బక్కపలచగా వుంటాడు. అయినా కాస్త చురుకుపాలెక్కువ!

ఇద్దరికీ మధ్యరకం మోసుగోడు. కబుర్లపోగు!

నారాయణని చూసి బుడ్డోళ్ళు గొడ్ల దగ్గరికి పరుగులు తీసారు.

"రేయ్, రోశిగా...ఆగరక్కడా!" అని నారాయణ కేకపెట్టాడు.

రోశోడు వణుకుతూ నిలబడ్డాడు. పోలుగోడూ, మోసుగోడూ ఆగకుండా పరిగెత్తారు.

"దొంగ...కొడకా! ఎన్ని తన్నినా బుద్ధి రాదేంరా నీకు? గొడ్లని మేపడానికా నిన్ను పంపింది, ఆటలాడుకోటానికా?" అంటూ నారాయణ బిగుసుకుని నించున్న రోశోణ్ణి గొడుగుతో రెండు దెబ్బలు కొట్టాడు.

రోశోడు ఏడుస్తూ "గొడ్లు చేలల్లో పడలేదు కాపా! ఆటిని చూసుకుంటనే వున్నాం" అన్నాడు.

"చూసుకునేదేంది? ఆడుకుంటూ గొడ్లని జూత్తావా? చేలల్లో పడిన తరువాతేం జూస్తావు?" అంటూ గొడుగుతో ఇంకొక దెబ్బ కొట్టాడు.

"అయ్యి బాగా మేసుకుంటుంటే చేలల్లో పడత య్యంటావేంది కాపా?" అంటూ రోశోడు ఏడుస్తూ గొడ్లవైపు వెళ్లాడు.

"తాట వలుస్తా గాడిదా, ఇంకొకసారి కానీ గొడ్లని వదిలి ఆటల్లో పడ్డావంటే? మజ్జెన్నం కూటికి దడి దగ్గరికి తోలుకురా గొడ్లని..." అంటూ బూతులు తిడుతూ దడివైపు వెళ్ళాడు నారాయణ.

నారాయణ వెళ్ళిపోయాక మిగతా బుడ్డోళ్ళిద్దరూ రోశోడి దగ్గరికి చేరారు.

రోశోడు ఏడుస్తూనే వున్నాడు. "పొద్దున కూడా తెగ తన్నేడ్రా పోలుగా! గొడ్ల పావిటి దగ్గర్నించి తెల్లారేటప్పుడు పోతే ఇప్పుడంట్రా రావటమని చేంతాడు తీసుకొని కొట్టేడు!" అంటూ ఏడుస్తూనే చెప్పాడు

రోశోడు.

పోలుగోడికి కూడా కోపంతో కళ్ళు ఎఱ్ఱబడ్డాయి.

"రేత్రి జొన్నల్లో పోటేయకుండా ఇంటికెల్లానని పొద్దున నన్ను కూడా మా కాపు కొట్టాడు. ఎటోకటు యెల్లిపోదామనుకున్నారా! అంత కోపమెక్కింది" అన్నాడు పోలుగోడు.

మోసుగోడు కూడా తన బాధ వెళ్ళబోసుకుంటున్నట్లు— "మొన్న సద్దికూడు తీసకపోతంటే దుత్త జారిపడి పగిలిపోయిందిరా! మా కాపు నువు కావాలని పగలకొట్టేవు అని కఱ్ఱ తీసుకుని కాలిమీద ఫెడేలుమని కొట్టేడు. కిందపడిపోయి చాలా సేపు ఏడిశారా! ఇంక లేచి నడవలేకపోయాననుకో! మా బాబుకి కబురెడితే ఆడొచ్చి బుజం మీదెక్కించుకుని యింటికి తీసక పోయేడు. నిన్న పన్లోకి రాలేదురా! మాధు, కాలు యెట్ట వాసిందో!" అని ఎడం కాలు యెత్తి మోకాలు కింద మూపించాడు. కప్ప తేలినట్లు ఇంకా వాపు నిగనిగలాడుతూ కనపడుతూనే వుంది.

"ఆ కఱ్ఱ లాక్కుని ఆణ్ణి సావగొడదామనిపించిందిరా!" అన్నాడు మళ్ళీ మోసుగోడు.

"కాపునే?" అని పళ్ళికిలించి కిసుక్కున నవ్వాడు పోలుగోడు.

"లేకపోతే యేందిరా? ఎంత దెబ్బ కొట్టిండో సూడు!" అని మోసుగోడు మళ్ళీ కాలు ఆడించాడు.

మోసుగాడి కాలిమీద వాపు మూసి రోశోడు ఎప్పుడో ఏడుపు ఆపేశాడు.

'ముగ్గురూ ఒకరి బాధలు ఒకరు చెప్పుకుంటూ కూర్చున్నారు. మళ్ళీ ఆట మొదలు పెట్టాలనే వుత్సాహం పోయింది.

"ఉత్తి పుణ్యానికే కొడతాఁడా మా కాపు మరీ అన్నేయంగా" మళ్ళీ కొత్తగా గుర్తొచ్చినట్లు అన్నాడు రోశోడు.

"మీ కాపు కాస్త మంచోడే! మా కాపు మరీ దొంగనాయాలురా! అడ్డం చూపి కొడతాడు. మా అయ్య ముందిటికి నన్ను అక్కడ పని మానిపిస్తానన్నాడు!" అన్నాడు మోసుగోడు.

"ఇంకో చోటన్నా కొట్టరేందిరా? ఎక్కడైనా వొకటే లెద్దూ? ఉన్న చోటుంటేనే పోతది!" నీరసంగా అన్నాడు పోలుగోడు.

"ఇందాక యెక్కడికయినా పారిపోవాలనిపించిందన్నావు కదరా?"

"నిజంగా అంత కోపమెక్కిందిరా పొద్దున!"

"మరి, ఎక్కడికి పోతావేందిరా?"

"ఎక్కడో చోటికి లెద్దూ! పారిపోయినప్పుడెవారం"

"కాపులు తన్నే దెబ్బలకి భయపడి ఎంతమందిరా దేశాలమీదకు పోయింది! నిరుడనంగా సుబ్బిగోడూ, నర్సిగోడూ యెల్లారు. యెటెల్లారో, ఏం పాడో? ఇంత వరకూ ఆమూకి తెలియదు!"

"సుబ్బిగాడయ్య చాలా ఊళ్ళు యెతుకులాడేడంట! పాపం, వొక్కడేనాయె కొడుకు! దిగులుపడిపోయేఁడా ఆయన!"

"వొరేయ్, మొన్న యెంకయ్య కాపు కోరుటుకి పట్నం పోయేడంట్రా! అక్కడ వోటేల్లో బల్లలు తుడుత్తా నర్సిగోడు కనపడ్డాడంటగా!"

"నిజంగానా? మరి ఎవురికీ తెలియదుకదరా ఈ మాట!"

"ఆయన వాళ్ళరుగు మీద కూర్చుని ఎవురి తోటో అంటంటే నేను కావిడి తెస్తా యిన్నారా! అడిగి కనుక్కుందామంటే కుదర్లేదు! నేనా సంగతి మర్చే పోయారా!" గుర్తు చేసుకుంటున్నట్లు ముఖం పెట్టి రోశోడు అన్నాడు.

ముగ్గురూ దిగులుగా చిన్న జీతగాళ్ళ పరిస్థితినీ, వాళ్ళకొచ్చే కష్టాల్నీ గూర్చి చాలాసేపు మాట్లాడుకున్నారు.

"గొడ్ల కాడి బుడ్డోడి పెళ్ళెప్పుడూ?
గొడ్లన్నీ చేలోన పడ్డప్పుడూ!"


అని నవ్వులాటలకి పాడుకునే, లల్లాయి పాటలమీదకు వాళ్ళ మనసులు పోలేదు ఆ పూట.

తరువాత రోశోడు గొడ్లని దడి దగ్గరకు తోలుకు

## సన్‌డే

మనసు
ఆనంద వలయాల
వలువలు ధరించి
మత్తుగా గమ్మత్తుగా
మెత్తని పాన్పుపై
పవళించే రోజు
ఆలోచనలు
రంగురంగుల జండాలై
నింగిలోనికి ఎగిరి
నీలి మబ్బులతో
దోబూచులాడే రోజు

—వేముగంటి



పోయాడు.

అక్కడ దడిలో పడుకుని నారాయణ కాపు గుర్రు కొడుతూన్నాడు. రోశోడు గొడ్లని మేకులకి కట్టి పడవేసి, మజ్జెన్నం కూడ పున్నీల్ల సంకటి తాగాడు.

ఈ అలికిడికి నారాయణ లేచాడు. రోశోడ్ని చూసి "రోయ్, ఎంతసేపు కూడు తాగేది? తొందరగా తాగి వామిలోకి పోయి మేత దూయి" అంటూ పని పురమాయించాడు.

రోశోడు మేతవామి దగ్గరకు పోయాడు. మేత దూసి, తరువాత చొప్ప నరకటం మొదలుపెట్టాడు.

ఒక గొడ్డు కట్టు వూడలాక్కుని మిరపతోటలో పడి మేయసాగింది.

చాలాసేపు బద్ధకంగా మంచం మీద పడుకుని బయటకు వచ్చిన నారాయణ కాపు కంట పడింది గొడ్డు. "రోశోడా, రేయ్! ఎక్కడ చచ్చావురా?" అంటూ నారాయణ గావుకేక పెట్టాడు.

కాపు కేకవిని రోశోడు నరుకుతున్న గొడ్డలి పడేసి ఆదుర్దాగా ఒక్క పరుగుతో దడి దగ్గరకు వచ్చాడు.

ఎదురుగా బర్రె మిరపతోటలో పడి మేస్తా వుంది.

రోశోడు బర్రె దగ్గరకు పరుగుతో వెళ్ళి బర్రెని తోలుకుపోయి మేకుకి కట్టేస్తూ "దీనెమ్మ...తాడు తెంచుకుందట్టుగా వుంది కాపా!" అంటూ నసుగుతూ మళ్ళీ వామి దగ్గరకు పోయి చొప్ప నరుకుతూ కూర్చున్నాడు.

ఎంత మేసిందో చూద్దామని మిరపతోట లోపలికి వచ్చిన నారాయణ కాపు తోటని చూసి అగ్గి మీద గుగ్గిలం అయిపోయాడు. ఆ బర్రె దాదాపు యాభై మొక్కలు తినీ, తొక్కి పాడుచేసింది. భరించలేని కోపంతో నారాయణ తుక తుక వుడికిపోయాడు.

"లమ్డీ కొడకా! నువ్వసలు బర్రెని కట్టేసావంట్రా?" అంటూ నారాయణ కాపు అక్కడే వున్న బండి నాటు కట్టెతో రోశోడి దగ్గరకు వచ్చాడు.

"కట్టేసాను కాపా, అదే తెంచుకుందీ!" అంటూ రోశోడు భయంతో వణికపోతూ అన్నాడు.

"ఆ తోట తిన్న నష్టం నువ్వు కట్టిస్తావా, నీ అయ్య కట్టిస్తాడ్రా? లజ్జెకొడకా! ఎన్ని తన్నినా నువ్వు అలివి కావటం లేదురా!" అంటూ నారాయణ నాటు కట్టెతో రోశోడ్ని కొట్టటం మొదలుపెట్టాడు.

"నీకు దండం పెడతా కాపా! నన్నొదిలిపెట్టు కాపా!" అంటూ రోశోడు పెద్దగా ఏడుస్తూ కూలబడ్డాడు.

"వదల్టమా? నిన్నా?" అంటూ పూనకం పట్టినవాడిలా వూగుతూన్నాడు కాపు.

కింద పడిన రోశోడు ఏడుస్తూ, దెబ్బ నించి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నా కనికరం లేకుండా దెబ్బ మీద దెబ్బ కొడుతున్నాడు కాపు.

రోశోడి చెయ్యి చొప్ప నరుకుతున్న గొడ్డలి మీద పడింది. ఏదయితే అదే అవుతుంది లెమ్మని రోశోడు గొడ్డల్ని ఎత్తాడు. దెబ్బలు కొడుతున్న కాపు హఠాత్తుగా ఆగి "ఏరోయ్ గొడ్డలెత్తుతున్నావ్?" అన్నాడు.

రోశోడు గొడ్డలి పట్టుకుని అవ్వాయి చువ్వ మాదిరిగా పైకి లేచాడు. "నీ యమ్మ......ఈ సారి కొట్టు చూస్తా!" అని ఒక్క అరుపు అరిచాడు.

కాపుకి తల తీసేసినట్టయింది. పళ్ళు పట పట కొరికాడు. "ఏందిరా, మళ్ళీ అను? ముందా గొడ్డల్ని కింద పడెయ్!" కోపంతో బుస కొడుతూ అన్నాడు.

"నీ చేతిలో కట్టె పడెయ్యిరా ముందు!" నిర్భయంగా రోశోడు పెద్దగా అరిచినట్లు అన్నాడు.

ఆ అరుపుకీ, వాడి చేష్టకీ కాపు కొయ్యబారి పోయాడు.

తన బుడ్డ జీతగాడు రోశోడు!

తను కొడుతుంటే భయంతో వణికి పోయే రోశోడు!

తన ఎంగిలి కూడు తిని కుక్కలా బతకాల్సిన రోశోడు!

తన మీదికి గొడ్డలెత్తటమా? తనని పట్టుకు బూతు మాట అనటమా?

ఎంత అవమానం!

బుడ్డలమ్డీ కొడుకు! ఆ గొడ్డలితో పైకొస్తాడా ఏమిటి?

తను అసలే బలహీనుడు! ఆ గొడ్డలి దెబ్బ ఏ భుజం మీదో, తల మీదో పడితే ఇంకేముంది? మూకంతో కొట్టినా కొట్టొచ్చు!

"కొడతావా ఏందిరా?" కట్టె ఎత్తిపట్టుకుని బింకంగా అన్నాడు కాపు.

"కొట్టకేం రా?" అంటూ రోశోడు గొడ్డల్ని వూని ముందుకి కదిలాడు.

కాపు వెనక్కి గెంతి పది బారలు పరుగు తీసాడు.

"బర్రెని కట్టేసాను కాపా అన్నా యినకుండా కొట్టావే? నిలబడు కాపా, పారిపోతావేం?" అని రోశోడు ఆనందంగా పెద్ద నవ్వు నవ్వాడు.

వాడికి ఎంతో ఆశ్చర్యంగా వుంది.

కాపు తనని చూసి పారిపోవటమా?

"వొదిలిపెట్టు కాపా, దణ్ణం కాపా!" అంటూ ఏడుస్తూ దణ్ణం పెట్టినా వదలని కాపు—

తను గొడ్డలి ఎత్తేసరికి పరుగు మొదలెట్టాడు!

ఎంత ఆశ్చర్యం!

పది బారలు పరిగెత్తిన కాపు, ఆగి, వెనక్కి తిరిగి "మీ అయ్యకి చెప్పకపోతే చూడు......నిన్నేం చేస్తానో చూడు......" అంటూ అరిచాడు.

"అక్కడ నిలబడు కాపా, తేల్చుకుందాం!" అంటూ గొడ్డల్ని ఎత్తి పట్టుకున్న రోశోడు, పరుగెత్తేలా చిన్న పిల్లల్ని వులికించినట్లు వులికించాడు.

పరుగు లంకించుకున్నాడు కాపు!

ఊడిపోతున్న పంచె గోచీ కూడా పెట్టుక్కోకుండా—

అలుపు సొలుపుల్ని లెక్క చేయకుండా—

వొకటే పరుగే పరుగు!

"నిన్నేం చేస్తానో చూడు......" అంటూ పరిగెత్తుతూ అరుస్తూన్నాడు కాపు.

రోశోడికి నవ్వాగ లేదు.

●

# రోణంకి వారి స్మృతులు

నాకు జ్ఞాపకం వున్న మొట్టమొదటి అద్భుత కథ— మా అవ్వ చెప్పగా నేను విన్న కథ. మా అవ్వ అంటే మా తండ్రిగారి తల్లి. మా అవ్వ శ్రీకాకుళం ప్రాంతపు తియ్యని తెలుగులో చాలా చమత్కారంగా, మధ్య మధ్య నటనతోసహా కథలు చెప్పడంలో దిట్ట.

మా అవ్వచెప్పిన కథ— "పులికి మేనమామ పిల్లి". ఆ కథను నా స్వంత మాటల్లో చెప్పే ప్రయత్నం చేస్తాను.

అనగనగా పులీ, పిల్లీ వున్నాయి. అవి రెండూ ఒక రాత్రి మీద ఒక అడవిలోంచి నడుస్తున్నాయి. కొంత దూరం నడిచే సరికి ఒక గ్రామ సమీపానికి వచ్చాయి. అల్లంత దూరంలో రాజుకుంటున్న అగ్గి కనపడింది.

పిల్లి— మేనల్లుడైన పులితో "ఒరే అబ్బీ, నేను చుట్ట కాల్చుకుని వస్తాను. ఇక్కడే వుండరా" అని చెప్పి మెల్లిగా వూరివేపు, రాజుకుంటున్న అగ్గి వెలుతురు కనిపిస్తున్న వేపు బయలుదేరింది.

## అవ్వ చెప్పిన అద్భుత కథ

ఊరి చివర ఒక చెట్టు కింద పొయ్యి వుంది. ఆ పొయ్యిమీద పాలకుండ వుంది. ఆ పాలు మరుగుతున్నాయి. సమీపానికి వెళ్లేసరికి పిల్లి ముక్కులో పాలవాసన పడింది. పిల్లికి మరి కదలాలనిపించలేదు. పాలు కుత కుత మరుగుతూ మీగడ కట్టేయి. పిల్లి కళ్లు ఆర్పుతూ తెరుస్తూ చాలా ఆశగా ఆ పాలవేపే చూస్తున్నది. పాలకుండ దగ్గిర కూర్చుని వున్నముసలమ్మ ఏమరుపాటున రెప్ప వేస్తే, పాలు తాగెయ్యాలని పిల్లి ఆశ. ముసలమ్మ రెప్ప వెయ్యలేదు.

ఒకటి రెండు పర్యాయాలు పిల్లి పాలకుండ వేపు దూకబోయింది. కాని ముసలమ్మ చేతిలో వున్న కర్రతో దాన్ని అదిలించింది. పిల్లికి నిరాశే ఎదురయింది.

చివరికి తెల్లగా తెల్లవారిపోయింది.

పిల్లి మాత్రం పాలు త్రాగలేక పోయింది.

ఆ పిల్లి ఆ గ్రామంలోనే వుండి పోయింది.

పులి తన మేనమామ అయిన పిల్లికోసం అడవిలో ఎదురుచూసి ఎదురుచూసి విసిగి పోయింది. ఎంతకూ పిల్లి మామ జాడలేదు. ఆఖరికి ఆ పులి అరణ్యాలు పట్టేసింది.

ఈ విధంగా పిల్లి పల్లెలోనూ, పులి అడవి లోనూ వుండి పోయాయి.

ఈ కథ నేను చాలా చిన్నప్పుడు విన్నాను. పులికి పిల్లి నిజంగానే మామ అవుతుందని నమ్మేశాను. ఈ కథ నాకిప్పటికీ ఎంతో ఇష్టం. ఒక కథను అంత గొప్పగా చెప్పడం మనదేశంలోని ముసలి వాళ్లకు సాధ్యం అయ్యేది. ●